
# దారితప్పిన తెలివి



సి.ఎస్.రావు

రాజమండ్రి సెంట్రల్ జైలు.

జైలులో మారుమూల ఒక సెల్. సెల్‌లో నెం. ముప్పయిరెండు పచారు చేస్తున్నాడు. నెం. ఇరవై మూడు ముప్పయిరెండుని కాసేపు పరిశీలనగా చూశాడు. "జైలుకు రావడం ఇదే మొదటిసారా" అని అడిగాడు. ముప్పయిరెండు నడుస్తున్నవాడు ఆగాడు. ఇరవైమూడువైపు చూడకుండానే "ఈ జైలుకి రావడం ఇదే మొదటిసారి" అన్నాడు.

"నీ పేరు?"

"దేముడు."

"రాముడివా? కృష్ణుడివా?"

ముప్పయిరెండు ఆ ప్రశ్నకు నవ్వుకుని "కృష్ణుడ్నే" అన్నాడు.

"ఎన్నాళ్ళుంటావ్" ఇరవైమూడు అడిగాడు.

"మూడ్నెల్లు వుండమన్నారు."

"ఇంతకీ చేసిన నేరమేమిటి?"

"దొంగతనం."

"తాళాలు పగలగొట్టిన కేసా? కన్నం వేసిన కేసా? ఇంటి కప్పునుంచి దిగిన కేసా?" ఇవన్నీ కాకపోతే దారిదోపిడి కేసా?"

"నువ్వు జర్నలిష్టువా?" అని అడిగాడు ముప్పయిరెండు.

"అంత కోపమెందుకయ్యా? ఇద్దరిమే వున్నాం, తోచక అడిగాను. ఇష్టమయితే చెప్పు. కష్టమయితే మానెయి. నీకు తెలుసో తెలీదో అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పది అన్నారు. అలాగే అన్ని స్నేహాల్లోకి జైలుస్నేహం గొప్పది అన్నారు. మా వూరి మాజీ సర్పంచి ముసలోడు! మొన్నీమధ్యే పోయాడు. ఆయనెప్పుడైనా ఉపన్యాసమిస్తే "గాంధీగారూ నేనూ జైల్లో వున్న రోజుల్లో........" అనే మొదలెట్టేవాడు. అదే టైములో నల్లబ్బులు అని ఓ దొంగ కూడ అదే జైలులో వుండేవాడు. ఆ అబ్బులుగాడు కూడా అంతే, మాటకు ముందు 'మన మాజీ సర్పంచుగారూ నేనూ జైల్లో వుండే రోజుల్లో' అని మొదలెట్టేవాడు" అని ఇంకా ఏదో ఇరవై మూడు మాట్లాడబోతుంటే ముప్పయిరెండు "నువ్వు బలే సరదాగా మాట్లాడుతున్నావే. నువ్వెందు కొచ్చావిక్కడికి?" అని అడిగాడు.

"మంది దొంగతనం కేసు కాదు."

"మరి?"

"నేను తరచూ వస్తూనే వుంటాను."

"సరే. నేరమేమిటో చెప్పకూడదా?"

"అదా! పెద్ద నేరమేమీ కాదు. స్మగ్లింగ్ వ్యాపారం."

"ఏ మాత్రం సంపాయించావ్?"

"సర్లే. దంపినమ్మకు బొక్కిందే కూలి అన్నట్టు మనకు రోజు గడవడమే ఆదాయం. అసలు ఆదాయాలు తన్నుకుపోయే గద్దలు వేరే వుంటాయి."

"ఓహో, ఆ గ్యాంగులో మనిషివన్నమాట."


"కరక్టుగా చెప్పావ్. సిసలైన కార్య కర్త ననుకో."

"ఇంతకీ నీ విషయం చెప్పావుకాదు" అన్నాడు ఐదవైమూడు.

ముప్పయిరెండు మాటల్లో చెప్ప కుండా ఏక్షన్లోనే జేబుదొంగ అని చెప్పాడు.

"నువ్వు దొంగ అంటే ఎవరు నమ్ము తారు. నీ మొఖంలో ఆ కళే కనబడటం లేదు."

"మెరిస్తేనే బంగారం అనుకుంటే ఎలా? మెరవకపోయినా బంగారం బంగా రమే. వెనక నా చిన్నతనంలో మా వూళ్లో కాంతమ్మ అని ఒకావిడ వుండేది.



అర్ధరూపాయంత బొట్టు, చుట్టు జరీ వెంకటగిరి చీర, హారపువళ్ళెం అంత బర్మా ముడి, ముడిచుట్టూ మల్లెపూల దండ సింగారించుకొని ఆలయానికొస్తే జనం అంతా రెప్పార్పకుండా చూసే

వారు. పతివ్రత అన్న పదానికి అర్థం తెలియకపోతే ఆవిడ్ని చూపించి, 'పతివ్రత ఇలా వుంటుంది' అని చెప్పేలా వుండేది. కాని అసలు విషయం ఏవిటంటే, మా వూరి కరణం గారు, మునసబుగారు, ప్రెసి డెంటుగారు, వీళ్ళు కాక ఆవిడ భర్త, నలుగురినీ పెంపుడు కుక్కపిల్లలని మేనేజిచేసినట్లు మేనేజ్ చేసేది. ఆ నలుగురూ ఎప్పుడూ కరుచుకొని,

మొరుగుకొని ఎరగరు. అంచేత ముఖం చూసిమనిషిని చదవటం అంత తేలిక్కాదు."

"మంచి తెలివైనవాడిలాగే వున్నావు. ఇంత తెలివుండి, జేబుదొంగ వెందుకయ్యావు?"

"స్మగ్లర్ని కమ్మంటావా?"

"తప్పంటావా?"

"కాకపోతే జైలుకి ఎందుకొచ్చావ్?"

"పిచ్చివాడా. జైలులో వున్నవారం దరూ నేరస్థులు కాదు. బయట ప్రపం చంలో వున్నవారందరూ పెద్దమనుషులు కారు. స్మగ్లింగ్ అంటేఏమిటి నీపుద్దేశ్యం? ఇంకో దేశంనుంచి వస్తువు పట్టుకొచ్చి డ్యూటీ కట్టకుండా అమ్ముకోడం. అంటే ప్రభుత్వాన్ని మోసంచేయడం. అంతే కదా? ఆ మాటకొస్తే ప్రభుత్వాన్ని మోసం చెయ్యనిది ఎవరయ్యా? తప్పుడు లెక్కలు వ్రాసి ఇన్కంటాక్సు ఎగ్గొట్టం మోసం కాదా? సేల్సుటాక్సు ఎగ్గొట్టం మోసం కాదా? లంచం పుచ్చు కోడం మోసం కాదా? వ్యభిచారం నేరం కాదా? ప్రభుత్వంలో వుండి ప్రభు త్వాన్నే మోసంచేయడం మోసం కాదా? ఒక రకంగా చూస్తే అంతా మోసమే. దేశమే ఒక పెద్ద జైలు. ఈ జైలు వుంది చూశావ్, ఇది దేవాలయం లాంటిది. ఇక్కడ వున్న నాలుగురోజులూ మోసంచెయ్య వానికి వీలుండదు."

ముప్పయిరెండు పకపక నవ్వి "నీది పెద్ద ఫిలాసఫీయే" అన్నాడు.

"ఫిలాసఫీ అంటే ఎక్కడ్నుంచో పుట్టుకురాదు. ఆలోచనల నుంచి, అను భవం నుంచి పుట్టిందే ఫిలాసఫీ. బి.ఏ ప్యాసయ్యాను. ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగం లేదుకదా అని ఆకలి లేకుండా పోతుందా? అందుకే ఈ ఫీల్డు లోకి అడుగుపెట్టాను. నా మాట విని ఆ జేబులు కట్చేయడం మానేసి నాతో చేరు. హాయిగా రోజు గడిచిపోతుంది."

"నా కిష్టం లేదు. నేను చేసే పనిలో కావలసినంత నేర్పరితనం నాకు వుంది. ఎవరి ఆస్థి మొత్తం నేను దోచుకోను. ఎవరి మెడలోని తాళిబొట్టు నేను తెంపు కోను. ప్రభుత్వాన్ని మోసం చెయ్యను.

సింపులుగా కొత్త బ్లేడుతో వున్నవాడి జేబు కట్ చేస్తాను. ఆ జేబులో వున్నది తీసుకొని నా జేబులో వేసుకుంటాను. దాంట్లో మళ్ళా తిరుపతి వేంకటేశ్వర స్వామికీ, భద్రాచలం రాంబాబుకి వాటాలివ్వను. కష్టార్జితం కాబట్టి హాయిగా నేనొక్కడినే అనుభవిస్తాను. జేబులో డబున్ననాడు వేళకు భోజనం, టిఫినూ, నచ్చిన బట్ట, రాత్రి అయ్యేసరికి క్లాసైన మందు, సరే ఆ తరువాత వీలునిబట్టి ఇంకా ఏమేమి కావాలో అన్నీని. లక్షలూ, కోట్లూ సంపాయించినవాడు మాత్రం ఇంతకన్నా ఏం అనుభవిస్తాడు? బయట ప్రపంచంలో వుంటే ఎలిజబెత్ రాణి అల్లుడికంటే దర్జాగా బతికేస్తాను. జైలుల్లోకి వస్తేనే ప్రోబ్లమ్. మందు లేకపోతే మనసూరుకోదు" అన్నాడు కాస్త బాధగా ముప్పయిరెండు.

"మందు లేదని వర్రీ అవకు. జైలు స్నేహం గొప్పదని ఇందాకే చెప్పాను. ఒక గంటలో మనకి బయట్నించి ఒక పెద్దమనిషి భోజనం పంపిస్తాడు."

"నాకు భోజనం లేకపోయినా ఫరవా లేదు. మందు లేకపోతే తోచదు."

"నా కలా కుదరదు. మందులేని భోజనం భోజనమే కాదు."

"అదెలా.... సూపరింటెండెంటు చాలా స్ట్రిక్టు అట కదా!"

"స్ట్రిక్టే. అందుకే స్ట్రిక్ట్లీ కాన్ఫిడెన్షియల్‌గా మందు మన కాళ్ళ దగ్గరికి వస్తుంది."

"ఎలా వస్తుందయ్యా?"

"తాగబోతూ ఉష్టు అడుగుతా వెందుకు బ్రదర్. చూడు" అన్నాడు ఇరవైమూడు.

ముప్పయిరెండు మందు దొరుకుతుందన్న ఆశ కలిగిన తరువాత నిమిష మొక గంటలా గడుపుతున్నాడు. కాస్సేపట్లో క్యారేజి వచ్చింది.

"మందేది" అని అడిగాడు ఆత్రుతగా ముప్పయిరెండు.

"తొందరపడకు" అంటూ క్యారేజి విప్పాడు ఇరవైమూడు.

ఒక గిన్నెలో అన్నం, ఒకగిన్నెలో కూరలు, ఒకగిన్నెలో పెరుగు, ఒక గిన్నెలో రసం. అన్ని గిన్నెలు పరిశీలనగా చూశాడు ముప్పయి రెండు. ఎక్కడా బాటిల్ కనబడలేదు. అన్నం గిన్నెలోని అన్నాన్ని పెళ్ళగించి చూశాడు. అన్నమే వుంది. ముప్పయి రెండు పెంచుకొన్న ఆశలు కూలిపోయాయి. దిగాలు పడిపోయాడు. ఇరవైమూడు చిరునవ్వు నవ్వాడు. రసంగిన్నె తీసుకొని పైన తేలుతున్న పోపును చేత్తో తెట్టులా తీసేసాడు. చేతిలోకి వచ్చిన మిరపకాయ ముక్కలు, ఆవగింజలు, మెంతి గింజలు ప్రక్కన పారేశాడు.

"ఓ గుక్కెడు మింగి చూడు" అంటూ రసం గిన్నెను ముప్పయిరెండుకు అందించాడు.

ముప్పయిరెండు తటపటాయిస్తూనే ఓ గుక్కెడు మింగాడు. అతని ముఖం సూర్యకిరణాలు తాకిన కమలంలా వికసించింది. "బ్రాండీ. సేమసరుకులా వుంది" అన్నాడు.

"అవును బ్రదర్. విదేశాలనుంచే సరుకు ఇంపోర్టుచేసే జాతికి చెందిన వాడిని. కావలసిన సరుకును బయటి నుంచి జైల్లోకి తెప్పించుకోలేకపోతే మన తెలివెందుకు ? బ్రాండీలో లైటుగా సోడా కలిపి ఈ పోపు సామాను జల్లిస్తే అచ్చు రసంలా వుంటుంది. అంతే. సింపిల్" అన్నాడు ఇరవైమూడు నవ్వుతూ.

——

